అంగన్‌వాడీలంటే చిన్నచూపెందుకు...?

వాణీశ్రీ, జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వానికి అంగన్‌వాడీల పట్ల చిన్నచూపు తగదు.. ఎన్నికలపుడు జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని మాత్రమే అమలు చేయాలని మేం కోరుతున్నాం.. మాదేమీ గొంతెమ్మ కోర్కె కాదు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదు. వెట్టిచాకిరీ చేయించుకోవడం తప్ప 12ఏళ్లుగా వేతనం పెంచలేదు. తెలంగాణా కన్నా ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పారు. కేవలం 11,500 మాత్రమే ఇస్తున్నారు. కనీస వేతనం రూ.26వేలివ్వాలి.

మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి

ఎం.హైమావతి, నాయుడుపేట

మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలి. మూడు వందల జనాభా కలిగిన మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలి. అంగన్‌వాడీలో చదివే పిల్లలకూ యూనిఫాంతో పాటు అమ్మఒడి ఇవ్వాలి. హెల్పర్‌కు వయో పరిమితి 50 ఏళ్లు పెంచాలి. గ్రేడ్ 2 సూపర్‌వైజర్ పోస్టులకు వయోపరిమితి తొలగించి 164 పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. హత్యకు గురైన హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి.

కలెక్టరేట్లో ...అంగన్‘వేడి’..!

- కనీస వేతనం ఇవ్వాలంటూ 36 గంటల దీక్ష
- ఐసిడిఎస్ పరిరక్షణ... ఉద్యోగ భద్రతే డిమాండ్లు
- వేలాదిగా కదం తొక్కిన అంగన్‌వాడీలు

అంగన్‌వాడీల దీక్షలో ప్రసంగిస్తున్న కందారపు మురళి

వేలాదిగా తరలి వచ్చిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-తిరుపతి సిటి

అంగన్‌వాడీ టీచర్లు, వర్కర్లు, హెల్పర్లు తమ సమస్యల పరిష్కారం కోసం దేశ వ్యాప్తంగా చేపట్టిన సమ్మెలో భాగంగా తిరుపతిలో చేపట్టిన 36 గంటల మహాధర్నాకు కలెక్టరేట్‌కి అంగన్‌వాడీలు కదంతొక్కారు. సిఐటియు అనుబంధ సంఘం ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వేకువజాము నుంచే తిరుపతి కలెక్టరేట్‌కు తరలివచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అంగన్‌వాడీలు తమ ఆందోళనతో జిల్లా పాలనాధికారి కార్యాలయాన్ని అట్టుడుకించారు. ర్యాలీలో కేంద్ర, రాష్ట్ర పాలకుల నియంతృత్వ ధోరణిని నిరసిస్తూ అంగన్‌వాడీలు నల్లచీరలు ధరించి, ఎర్రజెండాలు చేతబూని భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సభస్థలానికి చేరుకుని అంగన్‌వాడీల ఆక్రోశాన్ని వెలగక్కారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ నేడు దేశ వ్యాప్తంగా 14 లక్షల సెంటర్లకు చెందిన అంగన్‌వాడీలు సమ్మె చేపట్టారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న ఐసిడిఎస్‌కు 95వేల కోట్ల రూపాయలను మోడి ప్రభుత్వం కోత విధించి నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే కుల, మతాల మధ్య చిచ్చుపెట్టి, ఘర్షణ వాతావరణాన్ని సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఏపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు పద్మనీల, వాణిశ్రీలు మాట్లాడుతూ మోడి ప్రభుత్వం అంగన్‌వాడీలకు గత 12 సంవత్సరాలుగా ఒక రూపాయి కూడా వేతనం పెంచలేదన్నారు. పాదయాత్రల సందర్భంగా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి 26వేల రూపాయలకు తగ్గకుండా వేతనం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీల పరిస్థితి ప్రస్తుతం దారుణంగా ఉందన్నారు. ఏదైన ఇబ్బంది వల్ల ఒక రోజు లీవు పెట్టాలంటే కూడా నలుగురి వద్ద నుంచి పర్మిషన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. మిని వర్కర్లను మెయిన్ వర్కర్లుగా గుర్తించాలని డిమాండు చేశారు. 36 గంటల నిరసనకైనా స్పందించి ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలన్నారు. అంగన్‌వాడీలకు న్యాయం చేయకపోతే రాబోవు ఎన్నికల్లో జగన్‌కూ చంద్రబాబుకు పట్టిన గతి తప్పదని హెచ్చరించారు. సిఐటియు నగర కార్యదర్శి ఆర్.లక్ష్మీ మాట్లాడుతూ అంగన్‌వాడీలది న్యాయమైన కోర్కెలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి. బాలసుబ్రమణ్యం కోశాధికారి కేఎన్ఎన్ ప్రసాదరావు, టిటిడి యూనియన్ నేత టి. సుబ్రహ్మణ్యం, పార్థసారథి లతో పాటు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జయచంద్ర, నరేంద్ర,ఐద్వా అధ్యక్ష, కార్యదర్శులు జయంతి, సాయి లక్ష్మి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాధవ్, ఆర్టీసీ నేతలు ఈఎస్ కుమార్, భాస్కర్ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ యూనియన్ నేత జి నాగ వెంకటేష్, రామకష్ణ, వేణుగోపాల్, మునిరాజ, బుజ్జి, రమేష్, గురవయ్య, వెంకటేశు, ముకుంద, హరినాథ్, చెంగయ్య, నాగరాజు, అంగన్వాడీ నేతలు హైమావతి, స్వరూపరాణి, ప్రభావతి, శ్యామలమ్మ హెప్సిబా, మునికుమారి, ప్రభావతి, నిర్మల, ఇంద్రాణి, నాగరాజమ్మ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

వాళ్ల పోరాటం... సుదీర్ఘం.. ‘మాట తప్పను... మడమ తిప్పను’ అని పాదయాత్రలో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ డిమాండ్... బాలింతలకు, చిన్నారులకు, గర్భిణులకు పోషకాహారాన్ని అందిస్తూ, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్న సేవలకు గుర్తింపుగా కనీస వేతనం, గ్రాడ్యుటీ పెంచాలంటూ కదం తొక్కారు.. కలెక్టరేట్‌కు వందలాదిగా చేరుకున్నారు.. సోమవారం 36 గంటల దీక్షను ప్రారంభించారు.. హామీని అమలు చేసేంత వరకూ వదిలేది లేదంటూ ‘పట్టు’బట్టారు.. సోమవారం వాతావరణం మేఘావృతమై చల్లగా ఉన్నా అంగన్‌వాడీల నినాదాలతో కలెక్టరేట్ ‘వేడెక్కింది’... మాట తప్పం... మడమ తిప్పం.. మహిళలమైనా వెన్ను చూపం... డిమాండ్లు సాధించేంత వరకూ పోరాడతాం.. పోరాడతాం అంటూ చిమ్మచీకట్లోనూ రాత్రివేళ కలెక్టరేట్ ప్రాంగణంలోనే నిద్రించారు.. జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం దిగివచ్చేంత వరకూ తాము తగ్గేదే లేదంటూ పిడికిళ్లు బిగించారు.. ఆట, పాట, సామూహిక భోజనాలు, సామూహిక నిద్రతో ఐక్య పోరాటానికి నాంది పలికారు. వీరి పోరాటానికి సిఐటియు వెన్నంటే ఉండి ఉద్యమానికి సంఘీభావం ప్రకటించింది.

చిత్తూరు కలెక్టరేట్ ఎదుట రాత్రి సైతం సెల్‌ఫోన్ల వెలుతురులో...నిరసన

తిరుపతి కలెక్టరేట్ ఎదుట రాత్రి నిద్రిస్తూ...నిరసన

ప్రసంగిస్తున్న వాడా గంగరాజు

ప్రజాశక్తి - చిత్తూరు

కోర్కెల దినోత్సవం సందర్భంగా 36 గంటలు నిరసన కార్యక్రమంలో భాగంగా సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ అట్టుడికింది. వేలాదిమంది అంగన్వాడీలు భారీగా కదం తొక్కారు. మొదట రోజు నల్ల చీరలతో నిరసన ప్రారంభమయ్యింది. ఈ కార్యక్రమానికి యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కేపీ లలిత అధ్యక్షత వహించారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి అంగన్వాడి వర్కర్స్ అని హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీలా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రతి పక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే తెలంగాణ ప్రభుత్వం కంటే అదనంగా వేతనాలు ఇస్తామని చెప్పి హామీ ఇచ్చి ఇప్పుడు విస్మరించడం దుర్మార్గమన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటి ఇవ్వాలని, అర్హులైన హెల్పర్స్‌కి ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

వేలాదిగా తరలి వచ్చిన అంగన్‌వాడీలు

సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, ఉపాధ్యక్షుడు పి.చైతన్య, కే సురేంద్రన్, వాడ గంగరాజు మాట్లాడుతూ కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వలన ఐసిడిఎస్ ను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఉద్దేశపూర్వకంగానే ఐసిడిఎస్‌కు నిధులు తగ్గిస్తున్నారని దేశంలో ప్రజా సంపదను కార్పొరేట్ శక్తులైన ఆదాని, అంబానీలకు అప్పగిస్తున్నారని దీనిని ఐక్యంగా తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. జిల్లాలో అనేక ప్రాజెక్టులు ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ప్రమోషన్లు, అంగన్వాడి పోస్టు భర్తీ చేస్తున్నారని దీని మానుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్లకు ప్రజా సమస్యలను వినడానికి తీరిక లేకుండా పోయిందని వెంటనే అంగన్వాడీల జిల్లా సమన్వయ కమిటీ సమావేశం జరిపి అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక ప్రభుత్వాలకు అంగన్వాడీల సంఘటిత శక్తి ఏంటో రుచి చూపించారని ఈ ప్రభుత్వం కూడా వెంటనే మేల్కొని అంగన్వాడీల ఆగ్రహానికి గురికాకముందే అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భవిష్యత్తులో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. జిల్లా పిడి వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, బెదిరింపు ధోరణి మానుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రకరకాల యాపులతో ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రమీల, కస్తూరి ,శ్యామల, అనిత, జమున, సుజని ,విజయ, మమత పంచవర్మ ధనకోటి, లీల, సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తా దాస్, లక్ష్మయ్య లతోపాటు భారీ సంఖ్యలో అంగన్వాడి వర్కర్లు మినీ వర్కర్స్ హెల్పర్స్ పాల్గొన్నారు.

టిడిపి మహిళా అధ్యక్షురాలు సంఘీభావం

అంగన్వాడి వర్కర్స్ చేపట్టిన 36 గంటల నిరసన కార్యక్రమానికి జిల్లా తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ సంఘీభావం తెలిపారు. కుప్పం నియోజకవర్గం నుండి 100 మంది తెలుగు మహిళలు విచ్చేసి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనసూయ, చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షురాలు సుగుణమ్మ, మహిళ సెక్రటరీ చంద్రకళ పాల్గొన్నారు.

యాప్‌ల పేరుతో వేధింపులు మానుకోవాలి

కె ఇంద్రాణి, పిచ్చాటూరు

ఇటు కేంద్రానికి సంబంధించిన పోషణ్ యాప్, రాష్ట్రానికి చెందిన వైఎస్ఆర్ యాప్ ఇవ్వడం వల్ల అంగన్‌వాడిలకు భారంగా మారింది. సరిహద్దు ప్రాంతాల్లో నెట్‌వర్కు సరిగ్గా రాదు. పని చేయకపోతే అధికారులు వేధిస్తారు. సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాల్లోనెట్‌వర్కు సమస్య తీవ్రంగా ఉంది. అప్‌లోడ్ చేయకపోతే చర్యలు తీసుకుంటున్నారు. బాలింతలకు కిట్లు సక్రమంగా ఇవ్వడం లేదు. రాజకీయ నాయకుల వేధింపులు మానుకోవాలి.

ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలి

శాంతి

ఉద్యోగ విరమణ చేసిన తరువాత రూ 5లక్షలు, వేతనంలో సగం పింఛన్ ఇవ్వాలి. 2017 నుంచి అంగన్‌వాడీలకు జీతాలు పెంచలేదు. కేంద్రం తీసుకొచ్చిన జీవో ఇంతవరకూ అమలుకు నోచుకోలేదు. మినీ వర్కర్లకు వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలి. వైఎస్ఆర్, సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలి. ఐసిడిఎస్‌ల నిర్వీర్యానికి కుట్ర జరుగుతోంది. సమస్యలు పరిష్కరించుకునేందుకు పోరాటాలను ఉధృతం చేయాలి.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నాగరాజమ్మ, తిరుపతి

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు కావడం లేదు. ప్రభుత్వ ఉద్యోగం పేరుతో పథకాలు ఆపివేయడం అన్యాయం, వేతనాలు చూస్తే ఉపాధి కూలికన్నా తక్కువ ఇస్తున్నారు. అంగన్‌వాడీల బలోపేతానికి బడ్జెట్‌లో నిధులు పెంచాలి. ఇతర రాష్ట్రాల్లో అంగన్‌వాడీల సమస్యలపై ఆయా ప్రభుత్వాలు స్పందిస్తున్నాయి. జగన్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నారు. అందుకే 36 గంటల దీక్ష చేస్తున్నాం.

నూతన విద్యావిధానం రద్దుచేయాలి

రాజేశ్వరి

ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలి. కక్షసాధింపులకు పాల్పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. పిల్లలకు సరిపడా పోషణ పంపిణీ చేయాలి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు ఇవ్వాలి. రాయితీ గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వం పంపిణీ చేయాలి. గ్రాడ్యూటీ అమలు చేసి ఆదుకోవాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.నూతన విద్యా విధానం భవిష్యత్ తరాలకు ముప్పు.

వెనుకబడిన వర్గాలకు రాజకీయ సమానత్వం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రాష్ట్రంలో వెనుకబడిన వర్గాలకు రాజకీయ సమానత్వం కల్పించిన మహనీయుడు సీఎం జగన్ మోహన్ రెడ్డి అని ఉప ముఖ్యమంత్రి కె.నారాయణ స్వామి కొనియాడారు. సోమవారం వెదురుకుప్పం మండల కేంద్రంలో జడ్పీ నిధులు రూ.50 లక్షలతో నిర్మించిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కాంప్లెక్స్, రూ. 40 లక్షలతో నిర్మించిన సిఆర్ కండ్రిగ సిసి డ్రైన్ నిర్మాణం, రూ.3 లక్షలతో కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ వంటి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉప ముఖ్యమంత్రితో పాటు చిత్తూరు ఎంపి ఎన్. రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ విజయానంద రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సీఎం రాష్టంలోని వెనుకబడిన వర్గాలైన ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీలను ఉప ముఖ్యమంత్రిగా చేసి రాజకీయ సమానత్వం కల్పించారని ముఖ్యమంత్రికి పాదాభివందనాలు తెలిపారు. రాష్ట్రంలో అభివద్ధి శరవేగంగా జరుగుతున్నదని, దీనిని ప్రజలందరూ గుర్తించాలన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసి ఎన్టీఆర్ జలాశయంలోని నీటితో చెరువులను నింపే కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని, ఇందులో భాగంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇల్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ప్రజల కొరకు నిరంతరం శ్రమించే ముఖ్యమంత్రిని ప్రజలందరూ పెద్ద మనసుతో ఆశీర్వదించాలని కోరారు. చిత్తూరు ఎంపి మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించుకోవడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. జడ్పీ ఛైర్మన్ మాట్లాడుతూ సంక్షేమం ఒక కన్నుగా ముఖ్యమంత్రి ప్రతి నెలా సంక్షేమ పథకాల అమలులో భాగంగా డిబిటి ద్వారా లబ్దిదారులకు ఆర్థిక సహాయం చేయడం జరుగుతుందన్నారు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి గంగాధర నెల్లూరు నియోజకవర్గం అభివద్ధికి కట్టుబడి ఉన్నారని, నియోజకవర్గ ప్రజలే ఆయనకు దేవుళ్ళుగా భావిస్తారని అన్నారు. సమావేశంలో జడ్పీ సిఈఓ ప్రభాకర్ రెడ్డి, సమగ్రశిక్ష ఎపిసి వెంకట రమణా రెడ్డి, పిఆర్ డిఈ చంద్రశేఖర్ రెడ్డి, తహశీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపిడిఓ సుధాకర్, ఎంపిపి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామ యోజన పథకంలో ఎంపీడీవోల పాత్ర కీలకం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా ఆదర్శ గ్రామాల నిర్వహణలో ఎంపీడీవోలు కీలకమని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ.యన్. రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, సాంఘిక సంక్షేమ శాఖ డిడి డాక్టర్ రాజలక్ష్మి, డిఇఓ విజయేంద్ర రావు, సర్వ శిక్ష అభియాన్ వెంకట్రామిరెడ్డి, డ్వామా పిడి గంగాభవాని లతో కలిసి ఎంపీడీవోల తో ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా ఆదర్శ గ్రామ నిర్వహణ పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు మేరకు జిల్లాలో మూడు విడతల్లో 60 గ్రామ పంచాయతీలను ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా ఆదర్శ గ్రామ పంచాయతీలుగా తయారు చేయుటకు తీసుకోవలసిన చర్యల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొదటి విడతలో 12 మండలాల్లో 50 శాతం కంటే ఎక్కువ ఎస్‌సి జనాభా కలిగిన 23 గ్రామపంచాయతీలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా 10 అంశాలకు సంబంధించి 50 శాతం ఎస్సి జనాభా కలిగిన గ్రామాలలో సర్వే నిర్వహించడం జరుగుతుందని అందులో తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, గ్రామీణ రోడ్లు, గహాలు, విద్యుత్, పెన్షన్లు, వ్యవసాయం, నైపుణ్య అభివద్ధికి సంబంధించి సర్వే నిర్వహించడం జరుగుతుందని అందు లో 100 శాతం అన్ని సౌకర్యాలు కలిగిన గ్రామాల జాబితాను అప్ లోడు చేయడం జరుగుతుందని, దీని పై కేంద్ర ప్రభుత్వం మళ్లీ ఒక సారి సర్వే చేసి న తర్వాత ఆదర్శ గ్రామాలుగా ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆదర్శ గ్రామాలకు సంబంధించి ఆగస్టు 15న మరియు జనవరి 26 రిపబ్లిక్ డే దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వము ప్రకటించడం జరుగుతుందన్నారు. ఆదర్శ గ్రామాలుగా ఎంపికైన ఆదర్శ గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం రూ. 20 లక్షల నిధులు మంజూరు చేస్తుందని దీనికి సంబంధించి ఎంపీడీవోలు సంబంధిత గ్రామాలలో పై వాటికి సంభందించి అన్ని పథకాలు అందరికీ అందుతున్నాయి లేవని సర్వే చేసి అప్లోడ్ చేయాలని సంబంధిత యం పి డి ఓ లను ఆదేశించారు.

ప్రజల సమస్యలకు పరిష్కార వేదికగా స్పందన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదు దారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి సోమవారం ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీ, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎల్.సుధాకర్, అడిషనల్ ఎస్పీ SEB శ్రీలక్ష్మిని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ఈ ఫిర్యాదులకు స్పందిస్తూ త్వరిత గతిన విచారణ జరిపి ఫిర్యాదు దారులకి న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 17 ఫిర్యాదులు అందాయి, వాటి వివరాలు...ఇంటి తగాదాలు-2, చీటింగ్-3, కుటుంబ తగాదాలు-4, వేధింపులు-1, ఆస్తి తగాదాలు-2, భూ తగాదాలు-5 ఉన్నాయి.

స్పందనలో 9 వినతులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నగరపాలక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో మొత్తం తొమ్మిది వినతులు అందినట్లు నగర కమిషనర్ డా.జె అరుణ తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం ‘స్పందన’ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. వివిధ సమస్యలపై నగర ప్రజలు వినతి పత్రాలు అందించారు. ప్రజల నుంచి అందిన వినతులపై శాఖాధిపతులు సత్వరం విచారించి చర్యలు తీసుకోవాలని కమిషనర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్-4, ప్రజారోగ్య విభాగం-4, టీపీవో-1 చొప్పున మొత్తం 09 వినతులు అందాయి. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డా లోకేష్, ఎంఈ వెంకట ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్పందన కార్యక్రమంలో అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్

కలెక్టరేట్‌లో స్పందనకు 303 అర్జీలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్పందనలో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించే స్పందనలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ ఎన్.రాజశేఖర్‌తో కలసి జిల్లా నలుమూలల నుండి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి అర్జీలను స్వీకరించారు. మొత్తం 303 అర్జీలు రాగా శాఖల వారీగా రెవెన్యూ శాఖకు సంబంధించి 204, ఎండోమెంట్ 2, జిల్లా ఎంప్లాయ్ మెంట్2, జిల్లా పంచాయతి శాఖ 7, పోలీసు శాఖ 2, ఆర్ అండ్ బి ట్రాన్స్ పోర్ట్ 1, ఎల్‌డిఎం 1, జిల్లా విద్యాశాఖ 3, ఐసిడియస్ 3, సిరికల్చర్ 1, నేషనల్ హైవే 1, ఆర్‌టిసి 1, డైరీ డెవలప్ మెంట్ 1, నగర పాలక సంస్థ 3, ఎస్ఇ ఇరిగేషన్ 1, హౌసింగ్ శాఖ 5, పెన్షన్, రేషన్ కార్డులు, ఇతరులు 65 అర్జీలు రావడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి పనిదినాల పెంపునకు చర్యలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జగనన్నకు చెబుదాం, స్పందన ఫిర్యాదులను పరిష్కరించే విషయంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు సోమవారం పేర్కొన్నారు. జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిఆర్ఒ ఎన్.రాజశేఖర్‌తో కలసి ఆర్‌డిఒలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎపిడిలు, ఇతర సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి ప్రజల నుండి అందే అర్జీలపై సత్వరమే చర్యలు చేపట్టాలని, జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించడంతో పాటు ఏ అర్జీ బియాండ్ ఎస్ఎల్ఎ కి వెళ్లకుండా రీఓపెన్‌కి అవకాశం లేకుండా పరిష్కారం చూపే దిశగా అధికారులు పనిచేయాలన్నారు. జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా వస్తున్న సర్వీస్ రిక్వెస్ట్‌లను పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని, అర్హత ఉండి ఇంకనూ ప్రభుత్వ పథకాలు పొందని వారు సంబంధింత ధ్రువపత్రాలను జగనన్న సురక్ష క్యాంపులలో పంపిణీ చేయాలని తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలుకు సంబంధించి ఉపాధి పని దినాలను పెంచే అంశంపై ఏపీడీలు, ఏపీఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి పని దినాల పెంపునకు కృషి చేయాలన్నారు. కూలీల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలని మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జడ్పీసీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యుఎస్ఎస్ఈలు ఉమామహేశ్వర్ రెడ్డి, విజయ్ కుమార్ రెడ్డి, శంకర్ బాబు, హౌసింగ్, డ్వామా పిడీలు పద్మనాభం, గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి-యాదమరి: గర్భిణులు తప్పనిసరిగా ప్రతి నెలా ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని యాదమరి వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ సూచించారు. సోమవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి మాతత్వ సురక్ష యోజన పథకం కింద గర్భిణులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించి చికిత్సలు అందించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ గర్భిణులు గర్భం దాల్చిన నాటి నుండి కాన్పు వరకు కనీసం నాలుగు పర్యాయాలైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రతి నెలా గర్భిణులకు ప్రత్యేకంగా 9వ తేదీన ప్రధానమంత్రి మాతత్వ సురక్ష యోజన పథకం కింద ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేయడం జరుగుతుందన్నారు. సిహెచ్ఒ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కాన్పులు సైతం ప్రభుత్వాసుపత్రుల్లోనే చేయించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు అవడం వలన కాన్పు సమయంలో శిశువుకు, తల్లికి ఏదైనా సమస్య ఎదురైతే సత్వరం వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. దీనివల్ల మాతా శిశుమరణాలు జరగకుండా నిరోధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అనసూయ, గర్భిణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల తనిఖీ

ప్రజాశక్తి-గుడిపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కడప, చిత్తూరు జిల్లాల ఉన్నత విద్యాశాఖ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి డాక్టర్ బాబు సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల రికార్డులను, అధ్యాపకుల టీచింగ్ డైరీలు, నోట్స్‌లు పరిశీలించి సూచనలు ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో చర్చించి వారి సమస్యలను, కళాశాల గురించి తెలుసుకొని అధ్యాపకులతో ఆయన మాట్లాడారు. రాయలసీమలోని అన్ని కళాశాలల కంటే ఇక్కడ ఎక్కువ విద్యార్థుల చేరడంతో కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీనారాయణకు ఆయన అభినందనలు తెలిపి, కళాశాల పురోగతికి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చారు.

నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రమైన సదుం జడ్పీ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు అభివద్ధి పనులను మంత్రి వ్యక్తిగత సహాయకులు తుకారాం, ఎంపీపీ ఎల్లప్ప తదితరులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఇదే క్రమంలో వెటర్నరీ కళాశాల నిర్మానానికి కేటాయించిన స్థలంలో విద్యుత్ లైన్ల మార్పు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో పుంగనూరు ట్రాన్స్‌కో ఈఈ విజయన్, ఏడీఈ నరేంద్ర, జేసిఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, ఎల్లారెడ్డి, లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-సోమల: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేయబడిన ఫెడరేషన్ నాలుగవ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా మండల కేంద్రంలోని అభివృద్ధి కార్యాలయం ఎదుట సచివాలయ ఉద్యోగులు కేక్ కట్ చేసి సంబరాలను జరుపుకున్నారు. ఫెడరేషన్ నాలుగవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని సచివాలయ ఉద్యోగులు ఎంపీపీ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఆనందోత్సాహాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఫెడరేషన్‌లోని మండల కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ప్రభుత్వానికి సమస్యలపై తమ బాధను తెలియచెప్పుతూ ముందుకు పోవడం జరుగుతోందని అన్నారు. కార్యక్రమంలో లోకేష్ కుమార్, రామచంద్ర, ధరణి కుమార్, దివ్యభారతి, షారుక్ ఖాన్, సురేష్, నాగార్జున, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ప్రభుత్వ కార్యకలాపాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: ప్రభుత్వ కార్యకలాపాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని పూతలపట్టు శాసనసభ్యులు ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని జంబువారిపల్లి సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం తహశీల్దార్ బెన్ రాజ్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో ప్రభుత్వం అందించే సేవలు ఉచితంగా అందిస్తున్నట్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంకా అందకుండా ఉన్న వారినిగుర్తించేందుకు సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని, గ్రామీణ ప్రాంతవాసులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైసిపి శిరీష్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మరమ్మతుకు నోచుకోని బోరుమోటారు స్టార్టరు

ప్రజాశక్తి-సోమల: పంచాయతీలోని భారతం మిట్ట, దాసరి వారి పల్లి గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే పంచాయతీ బోరు మోటారు స్టార్టరు మరమ్మతుకు గురి కావడంతో వారం రోజులుగా ఈ ప్రాంతంలోని ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దాదాపు 150 కుటుంబాల వారు తాగునీటి సరఫరా లేకపోవడంతో, చుట్టుపక్కల ఎక్కడ నీరు అందుబాటులో ఉంటే అక్కడికి వెళ్లి అతి కష్టం మీద తెచ్చుకుంటున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ కుమార్‌ను 'ప్రజాశక్తి' వివరణ కోరగా స్టార్టరు కాలిపోయిన సంగతి వాస్తవమేనని మెకానిక్ వద్ద బాగు చేయించి మంగళవారం బిగించి తాగునీటిని సరఫరా చేస్తామని తెలిపారు. అలాగే సోమల మండలం నెల్లిమంద పంచాయతీ నవాబుపేటలో గత 15 రోజులుగా తాగునీటిని గ్రామానికి సరఫరా చేసే బోరు మోటారు కాలిపోవడంతో గ్రామంలోని 50కి పైగా కుటుంబాలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సమీపంలోని పంట పొలాల వద్ద వ్యవసాయ బోర్లలో వచ్చే తాగునీటిని తెచ్చుకుంటున్నారు. సమస్యపై 'ప్రజాశక్తి' సంబంధిత నెల్లిమంద కార్యదర్శి రమణను వివరణ కోరగా వెంటనే స్పందించి నూతన బోరు మోటారును బోరులో దించి సమస్య పరిష్కారం చేసినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికే 'గడపగడపకు మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సమస్యల పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. సోమవారం మండలంలోని తగ్గువారిపల్లి పంచాయతీలో ఈ కార్యక్రమం ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందుతున్నాయా లేవా అని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని అందులో భాగంగానే ప్రతి గడపగడపకు వెళ్లి పథకాల గురించి వివరించి సంక్షేమ పథకాలు వారికి నేరుగా అందుతున్నాయని క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పాల ఏకిరి కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా, జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పాలకూర



రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జడ్పిటిసి సోమశేఖర్, ఎంపీటీసీ హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవ గోడపత్రికల విడుదల

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్వాతంత్ర్య అమృత మహోత్సవం సందర్భంగా కుటుంబ సంతోషం, శ్రేయస్సుకు కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిద్దాం అని కలెక్టర్ సగిలి షన్మోహన్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్వహించబడే ప్రపంచ జనాభా దినోత్సవం గోడ పత్రికలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారిణి డా ప్రభావతి దేవితో కలిసి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి శ్రీనువాసులు, జిల్లా గణాంక అధికారి జార్జి, జిల్లా ఆరోగ్య అధికారి గుణశేఖర్, జిల్లా డిప్యూటీ డెమో జయరాముడు, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

యూనిఫాం సివిల్ కోడ్ రాజ్యాంగ వ్యతిరేకం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: కేంద్ర లా కమిషన్ ప్రవేశపెట్టిన యూనిఫాం సివిల్ కోడ్ అన్ని మతాలకు వ్యతిరేకంగా ఉందని, యూనిఫాం సివిల్ కోడ్ ప్రతిపాదనను వెంటనే రద్దు చేయాలని కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపారు. ఈ నిరసనలో భారీ సంఖ్యలో ముస్లిం నాయకులు, మసీదు కమిటీ వారు, పాస్టర్లు, చర్చి నిర్వాహకులు, హిందూ సోదరులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్‌ను కలిసి అన్ని మతాలకు సంబంధించిన నాయకుల, దేవాలయాల, చర్చిల, మసీదుల కమిటీల వారి అభిప్రాయాలతో కూడిన లేఖలను జాతీయ లా కమిషన్ కార్యదర్శి పంపాలని, లేఖలను కలెక్టర్ వద్ద సమర్పించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జామియా మసీద్ కార్యదర్శి ఫాహీం భాష, శేషాపీరాన్ మసీదు కార్యదర్శి యం.అఫ్జల్ ఖాన్, చిన్న మసీదు కార్యదర్శి అల్తాఫ్, మదీనా మసీదు అధ్యక్షులు రహంతుల్లా, సౌకర్ సులేమాన్ మసీదు నిర్వాహకులు మొహిద్దిన్, ఫైరోస్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్ ఆరోపణలు దారుణం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని రకాల పథకాలను ప్రజలకు అందించేందుకు ఎంతో కష్టపడి, చిత్తశుద్ధితో మన వాలంటీర్లు పని చేస్తున్నారని అలాంటి వారిపై పవన్ కళ్యాణ్ లేనిపోని ఆరోపణలు చేయటం దారుణమని సోమవారం చిత్తూరు ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై పవన్ కళ్యాణ్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇస్తున్న గౌరవ వేతనం తీసుకుని నిస్వార్థంగా పని చేస్తున్న వాలంటీర్లు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారన్నారు.

వాలంటీర్ల నిరసన

నగరి : వాలంటీర్లు హ్యూమన్ ట్రాఫికింగ్ చేస్తున్నారంటూ జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద వారు నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాలంటీర్లలో 70 శాతం మంది మహిళలే ఉన్నారన్న విషయం కూడా పవన్‌కళ్యాణ్‌కు తెలియకపోవడం శోచనీయమన్నారు. తమపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు పవన్ కళ్యాణ్ క్షమాపణలు చెప్పాలని లేకుంటే పర్యవసానం తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు.

నగరి

అధికార పార్టీ నేతలను ప్రశ్నిస్తే దాడులా?

ప్రజాశక్తి-కుప్పం: నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులను ప్రశ్నిస్తే వారిపై దాడులు చేయడం దుర్మార్గమని స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని మల్లానూరు గ్రామంలో చెరువును పూడ్చేస్తున్నారని దళిత నాయకులు ప్రశ్నించడంతో వారిపై విచక్షణా రహితంగా దాడి చేశారు. దీన్ని తెలుగుదేశం నాయకులు తీవ్రంగా ఖండించారు. అనంతరం టీడీపీ నాయకులు మాట్లాడుతూ దళితులపై దాడి చేసిన వారిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. అదేవిధంగా టిడిపి నేతలపై అక్రమంగా రౌడీ షీట్లు ఓపెన్ చేస్తున్నారు, వైసిపి గూండాలపై ఎందుకు రౌడీ షీట్ ఓపెన్ చేయలేదని ప్రశ్నించారు. మల్లానూరులో వైసీపీ నేతల భూకబ్జాలు, దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని, సంబంధిత అధికారులు స్పందించి అరికట్టాలని లేకుంటే పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

వెదురుకుప్పం: మండల కేంద్రంలోని ప్రభుత్వ స్థలంలో వైసీపీ నేతల సహకారంతో అక్రమ భవన నిర్మాణాలను చేపట్టడంపై స్థానిక టిడిపి బూత్ కన్వీనర్ అనిల్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం, అధికారుల దృష్టికి సోమవారం తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేశారు. దీంతో డిప్యూటీ సీఎం సూచనల మేరకు పోలీసులు, వైసిపి నేతలు దాడులు చేయడం ఖండిస్తున్నట్లు టిడిపి మాజీ జిల్లా కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌ఛార్జ్ మోహన మురళి తెలిపారు. ఒకవైపు వాణిజ్య గహ సముదాయం, మరోవైపు పంచాయతీ మరుగుదొడ్డి మధ్యలో ఉన్న స్థలాన్ని ఒక ప్రైవేటు వ్యక్తి వైకాపా నేతల సహకారంతో ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపడుతుంటే దీని విషయమై అధికారుల దష్టికి తీసుకురావడానికి ప్రయత్నించిన స్థానిక దళిత టిడిపి నేతపై అధికారం జులుం ప్రదర్శించడం సరైన పద్ధతికాదని ఆయన ఆరోపించారు.

నియామకం

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: మండలంలోని వీరకనెల్లూరు పంచాయతీ పేటనత్తం గ్రామానికి చెందిన ఎం.మనోహర్ బాబు జిల్లా ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్‌గా నియమితులయ్యారు. ఈయన గతంలో మండల సాక్షర భారత్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహించారు.

ఎంఆర్‌పీఎస్ నాయకులపై దాడి అమానుషం

ప్రజాశక్తి-రామకుప్పం: కుప్పం మండలం మల్లనూరు గ్రామంలో చెరువును అక్రమంగా పూడుస్తుండటంతో ఎంఆర్‌పీఎస్ నేతలు అక్కడకు వెళ్లి చెరువును ఎందుకు పూడుస్తున్నారని ప్రశ్నించినందుకు వైసిపి నేతలు దాడి చేయడం అమానుషమని రామకుప్పం మండల ఎంఆర్‌పీఎస్ సీనియర్ నేత వెంకటేష్, రాఘవేంద్ర సోమవారం ధ్వజమెత్తారు. కార్యక్రమంలో రామకష్ణ, చంద్రప్ప, మనీ, వెంకటేశుతదితరులు పాల్గొన్నారు.

కుప్పం: స్థానిక వైసీపీ కన్వీనర్ హెచ్ఎం మురుగేష్‌ను తక్షణమే అరెస్టు చేయాలని సోమవారం ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్ట్ పార్టీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు స్థానిక భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం దగ్గర గాయాలు తగిలిన ప్రకాష్, రాజేష్, దళిత సంఘం నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి, నల్ల కండువాలు, నల్ల రిబ్బన్లు, నల్లజెండాలతో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీజ మహిళా డెయిరీ బోనస్ వితరణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ దశ వార్షిక సంబరాల్లో భాగంగా సోమవారం మండలంలోని రామనపల్లి గ్రామంలో మహిళా సభ్యులు, కంపెనీ సిబ్బంది, సంఘ సభ్యులు కలిసి శ్రీజ డెయిరీ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిపించారు. ఈ సందర్భంగా శ్రీజ డెయిరీ వారు పాలు పోసే వారికి బోనస్, 81 మందికి ఐదు లీటర్ల స్టీల్ క్యాన్ వితరణ చేశారు. అనంతరం ఏసీవో మునికృష్ణ మాట్లాడుతూ ఆవుల, దూడల పెంపకంపై అవగాహన, పాడి ఆవు అధిక పాలు వచ్చేలా చేయాలంటే ఆహారాన్ని ఏ ఏ మోతాదులో వాడాలో క్షుణ్ణంగా తెలియపరిచారు. కార్యక్రమంలో శ్రీజ డెయిరీ సూపర్‌వైజర్ విశ్వనాథ్, సంఘమిత్ర సావిత్రి, పాలమిత్ర సునీల్ కుమార్ రెడ్డి, వెటర్నరీ డాక్టర్స్ వెంకటరమణ, సుమిత్ర, బ్యాంక్ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి-రొంపిచెర్ల: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రిజ్వాన్ ఆధ్వర్యంలో సోమవారం ప్రధానమంత్రి సురక్షిత మాతత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ గర్భిణులు గుండెపరీక్ష, బిపి, షుగర్, ఉదర, రక్తపరీక్షలు వంటివి తప్పనిసరిగా ప్రతి నెలా చేయించుకోవాలని కోరారు. అదేవిధంగా గర్భిణులు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవడంతో బిడ్డ ఆరోగ్యంగా ఉంటాడని తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారిణి రాజేశ్వరి, సిహెచ్ఒ, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్ష మాతత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారు ఆదేశాల మేరకు డాక్టర్ విజయచంద్రన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు సహకారంతో పరీక్షలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన 90 మంది గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. శ్రీనివాసులు, తిమ్మక్క, టిఎస్ బుజ్జి, కార్తికేయ, వైద్య సిబ్బంది, గర్భిణులు పాల్గొన్నారు.

నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి-యాదమరి: గ్రామీణ ప్రాంతాల్లోని రైతులకు, ప్రజలకు కోతలు లేని విద్యుత్ సరఫరా చేయడమే ఎస్పీడీసీఎల్ లక్ష్యమని ఈఈ మహేశ్వర రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని ముద్దురామాపురం విద్యుత్ ఉపకేంద్రంలో 3.15 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను రూ 1.30 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఈఈల హాజరై ట్రాన్స్ ఫార్మర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయానికి పగటిపూట తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా అధునాతనంగా పవర్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. పవర్ ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సరఫరాకు ఎటువంటి అంతరాయం ఉండదని చెప్పారు. కార్యక్రమంలో చిత్తూరు రూరల్ ఈఈ హరి, డీఈ కొండయ్య, ఏఈలు గర్రప్ప, వాసు పాల్గొన్నారు.

నేడు ముత్యాలమ్మకు పొంగళ్లు

ప్రజాశక్తి-పెనుమూరు: స్థానిక గ్రామ దేవత ముత్యాలమ్మకు 44 గ్రామాల ప్రజలు మంగళవారం సాయంత్రం పెద్ద ఎత్తున పొంగళ్ళు పెడుతున్నట్లు ఆలయ ధర్మకర్త జంబుగోలం భాస్కర్ తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు బలిజవీధిలో వెలసిన సత్తమ్మకు మొదట ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామదేవత ముత్యాలమ్మకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం రెండు గంటల నుండి 44 గ్రామాల ప్రజలు స్వగ్రామాల నుండి డప్పు వాయిద్యాలు, బాణసంచా కాలుస్తూ ముత్యాలమ్మకు పొంగళ్ళు తీసుకొస్తారు. ఆలయ ఆవరణంలో పొంగళ్ళు వండి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్త కోరారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. మండలంలోని భాస్కర్ రెడ్డి కాంప్లెక్స్ సమీపంలో మురుగదాస్‌ను మామిడి కాయలు తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునిది అప్పలాయగుంట సమీపంలోని పూడి గ్రామమని సమాచారం. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్

ప్రజాశక్తి-చౌడేపల్లి: హత్య కేసులో నిందితులను రిమాండుకు తరలించినట్లు పుంగనూరు రూరల్ సీఐ మధుసూదన్ రెడ్డి సోమవారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు.. చౌడేపల్లి మండలం వెంగళపల్లి పంచాయతీ పాలెం పల్లికి చెందిన శ్రీరాములు (50) తరచూ తాగి వచ్చి తన భార్య పెద్ద బోయకొండమ్మను వేధించేవాడు. ఈ విషయాన్ని పెద్ద బోయకొండమ్మ శ్రీరాములు చెల్లెలు అయిన శారద, ఆమె భర్త శ్రీనివాసులు తమ్ముడైన చలపతి కుమారుడు గోవిందు విజయ కుమారులతో మొరపెట్టుకుంది. దీంతో వారు ముగ్గురు బోయకొండమ్మ కష్టాలను పోగొట్టాలనే ఉద్దేశ్యంతో శ్రీరాములును చంపాలని తలచారు. దీంతో ఈనెల 3వ తేదీన ముగ్గురు శ్రీరాములు ఇంట్లోకి వెళ్లి మూకుమ్మడిగా దాడి చేశారు. అనంతరం రక్తపు మడుగులో ఉన్న అతన్ని చూసి ముగ్గురు పరారు అయ్యారు. గుర్తించిన స్థానికులు అతన్ని 108 ద్వారా మదనపల్లి ఆస్పత్రికి తరలించారు. అక్కడ అతని ఆరోగ్య పరిస్థితి విషమించడంతో తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న శ్రీరాములు ఈనెల 5వ తేదీన మృతి చెందాడు. అతని భార్య పెద్ద బోయకొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నిందితులు ముగ్గురిని ఎస్ఐ రవికుమార్‌తో వెళ్లి పాలెంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అరెస్టు చేసి పుంగనూరు కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సిఐ తెలిపారు.

ఇరువర్గాల ఘర్షణ

ప్రజాశక్తి-సోమల: మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురం గ్రామానికి చెందిన బుచ్చిరెడ్డి, శశికళ, సుకుమార్ రెడ్డిలు, షామీర్, ఇమ్రాన్, ఖాదర్ వలీ, అబ్దుల్ సలాం, అస్మత్ బీ, సోనియాలు మామిడి తోట స్థలం విషయంగా ఇరువర్గాలు ఘర్షణపడి, కొట్టుకొని సోమల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఇరువర్గాల వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ నాగేష్ తెలిపారు.

వీఆర్‌వోపై దాడి

ప్రజాశక్తి-చిత్తూరు: రూరల్ మండలంలోని అనుపల్లి రెవెన్యూ విఆర్ఒ మునిరత్నంపై యాదమరి మండలం కోడిగుట్ట గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు సురేష్ దాడి చేసిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు... అనుపల్లి సచివాలయం పరిధిలో స్థలాల ఆక్రమణ, కబ్జాలపై కేసు పెట్టినందుకు అనుచరులతో కలిసి దాడి చేసిన సురేష్‌పై చిత్తూరు రూరల్ పరిధిలోని తాలూకా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మామిడి తోట కాపలాదారుడిపై...

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఇరికిపెంట పంచాయతీ పార్వతీనగర్ బంగ్లా ప్రాంతానికి చెందిన వనజ మండలంలోని నంజంపేట పంచాయతీ సరస్వతీపురం వద్ద ఉన్న తన మామిడి తోటకు కాపలాగా రమేష్‌ని నియమించింది. సోమవారం అతను కాపలా కాస్తూ ఉండగా నంజంపేట గ్రామానికి చెందిన అక్బర్ బాషా, ఇంతియాజ్, ఐరాల మండలానికి చెందిన ఎవి మమత అను ముగ్గురు మామిడి తోటలోకి దౌర్జన్యంగా ప్రవేశించి కాపలాదారుడు రమేష్‌ను కొట్టి బెదిరించారని తోట యజమానురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో ముద్దాయిల అరెస్ట్

ప్రజాశక్తి-నగరి: పట్టణంలోని బాలాజీ గోల్డెన్ సిటీలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జ్ఞానప్రకాష్ అనే పాలవ్యాపారి తన భార్యతో కలిసి బస్టాండు వద్దగల తన పాలదుకాణానికి వెళ్లాడు. అదే సమయంలో సినీ ఫక్కీలో ఇంటికి ప్రహరీగోడ వైపుగా ఉన్న కిటికీని తొలగించి చొరబడ్డ దొంగలు ఇంటిలోని బీరువాను పగలగొట్టి డబ్బులు, బంగారం చోరీ చేసుకొని వెళ్లారు. దీనిపై జ్ఞానప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ చోరీ సంఘటనలో దొరికిన ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సోమవారం చోరీకి పాల్పడిన తమిళనాడు తిరువళ్లూరు జిల్లా వేలప్పన్‌చావడికి చెందిన దొరై (20), ఎగ్మోర్, పుదుపేటకు చెందిన కుమార్ గోపాల్ (22), తిరువేలాంగణికి చెందిన రావిఅజిత్ మోసిస్ (22)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.2.18 లక్షల నగదును స్వాధీనం చేసుకొని ముద్దాయిలను కోర్టుకు హాజరుపరిచినట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

నాణ్యతతో మధ్యాహ్న భోజనం

ప్రజాశక్తి-సోమల: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం పాఠశాల ప్రార్థన కార్యక్రమంలో ఎంఈఓ-2 శివరత్నమ్మ పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు పరిశీలించి బోధన సరళిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని నాణ్యతతో రుచికరంగా వండి పెట్టాలని వంటలమ్మలకు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్లయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గంగజాతర

ప్రజాశక్తి-రామకుప్పం: స్థానికంగా నెలకొని ఉన్న గంగమ్మ ఆలయంలో జాతరను నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రైతు సంఘం వారు జాతరకు అంకురార్పణ చేపట్టగా సోమవారం ఉదయం వివిధ పుష్పాలతో అలంకరించి అభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం జ్యోతి నగర వైశ్య సంఘం వారు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు అందించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.